క్లుప్తంగా

కొమరబండ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న నిర్వాహకులు

షాబాద్: కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం భక్తులు హుండీలో వేసిన కానుకలను గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుండీ ఆదాయం రూ.39,315 వచ్చినట్లు చెప్పారు. ఈ డబ్బులను దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారు. అలాగే, సీతారామచంద్రస్వామి దేవస్థానం, సీతారాంపూర్ జాతర హుండీ ఆదాయం రూ.14,130, కట్నాలు రూ.23,370 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రమేష్, శేఖర్, బస్వలింగం తదితరులున్నారు.

ఘనంగా

కొండ పోచమ్మ బోనాలు



బోనాలను తీసుకువెళ్తున్న మహిళలు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురంలో మంగళవారం కొండ పోచమ్మ బోనాల జాతర ఎంతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే దేవాలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి అమ్మవారి బోనాలను, నైవేద్యాలను సమర్పించారు. గ్రామం నుంచి దేవాలయం వరకు బోనాలను ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. శివసత్తుల ఆటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ దేవాలయాన్ని గ్రామానికి చెందిన బానూరి క్రిష్ణ సొంత నిధులతో నిర్మించడం పట్ల గ్రామస్తులు ఆయను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న యూత్‌సభ్యులు

షాద్‌నగర్‌టౌన్: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంగళవారం నవ నిర్మాణ్ యూత్ అధ్యక్షుడు అఖిల్‌చారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద పదవ తరగతి విద్యార్థులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్ష రాసే విద్యార్థులకు ఎండ వేడిమినుంచి ఉపశమనం కల్గించేందుకు మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వాజీద్, సాజీద్, విజయ్‌కుమార్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి

కేశంపేట: మాజీ జెడ్పీటీసీ గుండె వెంకటయ్య మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది గ్రామాభివృద్ధి, మండల అభివృద్ధికి కృషి చేశారని పలువురు నాయకులు కొనియాడారు. వెంకటయ్య మృతి పట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ విశాల , బీఆర్ఎస్ నాయకులు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు తాండ్ర నిర్మల, చిన్నచంద్రు, శివయ్య, గ్రామస్తులు అబ్బి సుందరయ్య, లక్ష్మీనారాయణగౌడ్, నర్సింలు, సంతాపం వ్యక్తం చేశారు.

తైబజార్‌ను దక్కించుకున్న జగన్‌గౌడ్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్ఞానేశ్వర్ అధ్యక్షతన మంగళవారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో తైబజార్‌ను రూ.10లక్షల 50వేలకు చిన్న శంకర్‌పల్లికి చెందిన జొన్నాడ జగన్ గౌడ్ దక్కించుకున్నారు. జగన్ గౌడ్ వేలం పాటను అత్యధికంగా పెంచి ఐదవ సారి తైబజార్‌ను దక్కించుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ ధ్రువ పత్రం అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగిన 'పది' పరీక్షలు

కొత్తూరు: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు ఎంఈఓ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 553 మంది విద్యార్థులు ఉండగా బీ కేంద్రంలో 2(ఇద్దరు) పరీక్షలకు గైర్హాజరయ్యారు.

ఉనికి కోల్పోతున్న కాశన్నకుంట

- చెరువుకట్టకు పగుళ్లు
- పూడికతో నిండుకున్న శైనం
- కబ్జాలతో తగ్గిన విస్తీర్ణం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని కాశన్నకుంట చెరువుకు ఏళ్లుగా మరమ్మతులు కరువయ్యాయి. ప్రస్తుతం చెరువు కట్టకు పగుళ్లు రావడంతో పూర్తి స్థాయిలో చెరువు నిండితే కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనికి తోడు చెరువులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చేందుకు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన పాటు కాల్వలు ధ్వంసం కావడంతో భారీ వర్షాలు కురిసిన చెరువులోకి వరద సక్రమంగా రావడం లేదు. కొందరు రియల్టర్లు, పరిశ్రమల నిర్వాహకులు చెరువు ఎఫ్‌టీఎల్‌ను కబ్జాలు చేస్తున్నారు. ఏళ్లుగా మరమ్మతులు లేని కారణంగా కంపచెట్లు, పూడికతో నిండుకోవడం వల్ల చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఉనికి కోల్పోతుంది.

రంగుమారుతున్న నీరు..

మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ సమీపంలో సుమారు 32 ఎకరాల్లో కాశన్నకుంట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద ఒకప్పుడు 30 ఎకరాల ఆయకట్టు ఉండేది. వర్షాకాలంలో ఈ చెరువు నిండితే వ్యవసాయ బోర్లే కాకుండా గ్రామానికి తాగు నీటిని సరఫరా చేసే బోర్లలో కూడా నీటిమట్టం పెరిగేది. తద్వారా వేసవిలో అంతగా నీటి ఇబ్బందులు ఉండేవి కావు. స్థానిక మత్స్యకారులు ప్రతి ఏడాది లక్షలు వెచ్చించి చేపలను సాగు చేస్తున్నారు. మండల కేంద్రంలో పారిశ్రామికవాడ ఏర్పాటైన తర్వాత క్రమేణా కొన్ని పరిశ్రమలు కాలుష్య కారకమైన నీటిని వర్షాకాలంలో వరద నీటితో పాటు చెరువులోకి వదిలేశారు. దీంతో ఈ చెరువులోని నీరు మొత్తం కలుషితమయ్యాయి. ఒక దశలో చెరువులోని నీటిని పశువులు కుడా తాగనంతగా కలుషితమైయ్యాయి.

కబ్జాలకు గురవుతున్న శైనం

కాశన్నకుంట చెరువు చుట్టూ పరిశ్రమలు, రియల్ వెంచర్లు ఏర్పాటు అవుతున్నాయి. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అధికారులు, స్థానిక నాయకులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా శిఖం భూమిని కబ్జాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



కాలుష్య జలాల కారణంగా రంగు మారిన కాశన్నకుంట జలాలు

అంతేకాకుండా చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ వర్షాకాలంలో చెరువు నీటితో నిండుకుంటుందంటే అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు

నిబంధనల ప్రకారం.. చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్ (నీటి పరివాహక ప్రాంతం)లోపు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఇక్కడ మాత్రం ఏర్పాటు చేసిన వెంచర్ చెరువు నీటితోనే నిండుకుంటుంది. ఇక పలువురు వ్యాపారులు యథేచ్ఛగా చెరువు శిఖం భూమిని అక్రమించారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన వారు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఎఫ్‌టీఎల్‌లో ఏర్పాటైన వెంచర్

చెరువుకు మరమ్మతులు చేపట్టాలి



కాశన్నకుంట చెరువుకు మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టాలి. అప్పుడే కబ్జాలు, అక్రమణలు చేసిన శైనం బయటపడుతుంది. గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులు లేకపోవడంతో చెరువు మట్టితో నిండుకుంది.

–యాదగిరి, మత్స్యకార సంఘం సభ్యుడు, కొత్తూరు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కాశన్నకుంట చెరువును పరిశీలించి చెరువు పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. చెరువు శిఖంలో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదు. చెరువులోకి కలుషిత నీటిని వదిలినట్లు తేలితే చర్యలు తప్పవు.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు

అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 22వ వార్డులో కౌన్సిలర్ నడికూడ సరిత యాదవ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణం, మంచి నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. షాద్‌నగర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రం అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, ఏఈ నర్సింలు, డీఈ సాధిక్, నాయకులు యాదగిరి యాదవ్, విప్పరి నరేష్, అలీ, నర్సింలు యాదవ్, బాల్‌రాజ్, దాసరి నర్సింలు, శివరాజ్ సింగ్, మహేందర్, పెంటయ్య, యాదమ్మ, రజిత, పవిత్ర పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు అన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి మంగళవారం షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున సీఐటీయూ, రైతు సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎన్.రాజు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. తద్వారా బడా పారిశ్రామికవేత్తలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వ హామీలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. విదేశాల్లో దాగి ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి పేద ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు కనీసం రూ.26వేతనాన్ని చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 8ఏళ్లుగా దేశంలో అమలు చేస్తున్న మతోన్మాద అనుకూల విధానాలను నిరసిస్తూ కార్మిక రైతు వ్యవసాయ సంఘాలను చైతన్యం చేసేందుకు ఢిల్లీలో పదిలక్షల మందితో కిసాన్ మద్దూర్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీకి తరలివెళ్లిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయక్, సీఐటీయు నాయకులు లలిత, లక్ష్మి, జయమ్మ, ఇంద్ర, స్వప్న, లింగమ్మ తదితరులు ఉన్నారు.



ఢిల్లీకి బయలుదేరిన నేతలు

చిరుధాన్యాలతో ఆరోగ్యం

సీడీపీఓ నాగమణి

కొందుర్గు: ప్రతిరోజు ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్దఎల్కిచర్ల గ్రామంలో ఐకేపీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలు ప్రతినిత్యం పోషకాహారం తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు అధికంగా తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సరఫరా చేసే బాలామృతం తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లల్లో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయని ప్రతిఒక్కరూ ప్రతిరోజు తీసుకునేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పోషణ్ పక్వాడ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, సర్పంచ్ భూపాలచారి, ఎంపీటీసీ మంగమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, ఏపీఎం రామస్వామి, సీసీలు పాల్గొన్నారు.



పోషణ పక్వాడ్ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఆత్మీయ సభను విజయవంతం చేయండి

ఆ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, శ్రీహరియాదవ్‌లు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ సమీపంలోని పీ.వీ. కన్వెన్షన్‌లో నేడు(బుధవారం) నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ముదిగొండ శ్రీహరి యాదవ్‌లు కోరారు. మంగళవారం మండల పరిధిలోని పీవీ కన్వెన్షన్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన సభ వేదికలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొయినాబాద్ మండలంలో ఆత్మీయ సమ్మేళనాన్ని మూడు సెక్టార్లుగా విభజించి రెండు సెక్టార్లలో ఆత్మీయ సమ్మేళనం పూర్తి చేయడం జరిగిందన్నారు. మండలంలో ఆత్మీయ సమ్మేళనం మొదటి సెక్టార్‌గా మొయినాబాద్‌లో నిర్వహించామని రెండవ సెక్టార్‌ను చిన్నమంగళారం వీరన్నపేట్ విఠల్ పంక్షన్‌హాల్‌లో ఆత్మీయ కొనసాగిందని చివరగా మూడవది హిమాయత్‌నగర్ సమీపంలోని పి.వి.కన్వెన్షన్‌లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో బుధవారం 10 గంటలకు ప్రారంభం అవుతుందని ఈ సమ్మేళన కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి

అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం పార్టీ నాయకులు, కార్యకర్తల పై ఉందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రధాని మోదీ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గడప గడపకూ వెళ్లి వివరించాలని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఏప్రిల్ 8న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్‌లో రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటుగా పలు రైల్వే, రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్‌గా ఎన్నికైన డాక్టర్ విజయ్‌కుమార్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, కక్కునూరి వెంకటేష్‌గుప్త, మిథున్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బీటీరోడ్డు పనులు ప్రారంభం

కొందుర్గు: కొందుర్గు మండలంలోని ఆగిర్యాల నుంచి ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి వరకు బీటి రోడ్డు నిర్మాణం పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తమ కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, లింగం గౌడ్, బీమయ్య, నర్సింలు గౌడ్, మహేష్, రమేష్, పద్మయ్య, అనంతయ్య, నర్సయ్య, భీమయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

మూసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఏమైంది?

గ్రామస్తుల ఆమరణ నిరాహార దీక్ష

మొయినాబాద్ రూరల్: చిన్నమంగళారం గ్రామ సమీపంలోని మూసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం వెంటనే నిర్మించాలని గ్రామస్తులు, నాయకులు మంగళవారం ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షకు చిన్నమంగళారం గ్రామస్తులు, నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొని దీక్షలో ఉన్న వారికి పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన ప్రభుత్వం ఇప్పటికీ బ్రిడ్జి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసిన పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ప్రజలు వాగుదాటుతూ నీటి ఉధృతికి కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడితే దాదాపు 20 గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ దీక్షలో మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, యువజన సంఘాల యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

హనుమాన్ జయంతిని విజయవంతం చేద్దాం



సమావేశమైన విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, సభ్యులు

చేవెళ్ల: మండల కేంద్రంలో గురువారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్రను విజయవంతం చేద్దామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు భోజిరెడ్డి, భజరంగ్‌దళ్ మండల ప్రముఖ్ ధనుష్‌రెడ్డిలు అన్నారు. చేవెళ్లలోని హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులతో హనుమాన్ జయంతి వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చైత్ర పౌర్ణమి గురువారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. చేవెళ్ల హనుమాన్ దేవాలయం నుంచి వెంకటేశ్వరస్వామి పుష్కరిణీ సమీపంలోని హనుమాన్ మందిరం వరకు శోభాయాత్ర ఉంటుందని ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌సభ్యులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సాయిరాం, సందీప్‌గౌడ్, సాయి, త్రినేత్ర, ఆనంద్, జయసింహ, నాగరాజ్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండలంలోని అమ్డాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెన్స్ పని వల్ల ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్డాపూర్, వెంకటాపూర్, ముర్తూజగూడ, బాకారం, నజీబ్‌నగర్, కాశింబౌలి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

సర్పంచ్ సంతోష

నందిగామ: మహిళా సంఘం సభ్యులు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించుకోవాలని సర్పంచ్ మామిళ్ల సంతోష పేర్కొన్నారు. మండలంలోని చేగూరులో మంగళవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్–2.0లో భాగంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు, గ్రామస్తులకు ఆర్థిక అక్షరాస్యత , డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సంతోష హాజరై సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజు రోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బ్యాంకుల చుట్టు తిరిగే బదులు డిజిటల్ లావాదేవీలను అలవాటు చేసుకున్నట్లయితే సమయం ఆదా అవుతుందని, ఖర్చు తగ్గుతుందని వివరించారు. అంతేకాకుండా పనులు త్వరగా పూర్తవుతాయని చెప్పారు. అనంతరం గ్రామంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, ఏపీజీవీబీ కొత్తూరు బ్యాంకు మేనేజర్ గిరిజా, సీసీలు అరుణ, బుక్ కీపర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సంతోష

దొడ్డి కొమురయ్య త్యాగాలు మరువలేనివి



కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య త్యాగాలు మరువలేనివని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీపీతో పాటు పలువురు నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. నిజాం నవాబుల నుంచి వెట్టి చాకిరీ విముక్తి, భూమికోసం ఆయన చేసిన పోరాటాలు ఎందరిలోనే చైతన్యం తెచ్చినట్లు వివరించారు. కొమురయ్య త్యాగాలు, పోరాట పటిమను నేటి తరానికి తెలిసే విధంగా సీఎం కేసీఆర్ అధికారికంగా ఆయన జయంతి వేడుకలను నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, తహసీల్దార్ రాములు, నాయకులు శ్రీనివాస్‌నాయక్, గోవిందునాయక్ పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు మేలు

సర్పంచ్ రుక్సానా బేగం

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్ రుక్సానా బేగం అన్నారు. మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రుక్సానా బేగం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలా మంది నిరుపేదలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఈ శిబిరాల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటుగా, దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దృష్టి సమస్య తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి హైదరాబాద్‌లోని సరోజినీ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. 18ఏళ్ల నిండిన వారందరు శిబిరానికి విచ్చేసి కంటి పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఖాలెద్, ఉపసర్పంచ్ వసంత, వార్డు సభ్యులు అక్తర్ అలీ, ఫెరోజ్, మున్వర్, సుధాకర్ పాల్గొన్నారు.